

# సన్మానం

సద్దపల్లె చిదంబర రెడ్డి





**చిన్నప్పుడు** బొగ్గుతో రోడ్లపైన, గోడలపైన పిచ్చి వ్రాతలు వ్రా సేవాడినట. అందుకే-'పుట్టుకతో వచ్చినది పుడకలతోనూ పోదన్న సామెతను పొల్లు పోనీయకుండా, బడిలో చేరాకకూడా చేతికందిన ప్రతి కాగితాన్నీ ఖరాబు చే సేవాడిని.

దానికి దృష్టాంతంగానే-భద్రంగా దాచుకొన్న తెల్ల కాగితాలు కనబడక పోయేసరికి కోపంతో తోలు ఒలిచి టాపుకు వ్రేలాడదీ సిన మా అన్నయ్య చర్య నా స్మృతిపథంలో ఇప్పటికీ ఫ్లాష్ బాక్‌లా మెదలుతూనే ఉంది.

తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుందని. బరికి బరికి దురద గజ్జిగా మారుతుందని,ఆర్యులు పలికిన పలుకులు అబద్ధా లవడానికి వీలు లేదు. కదా!

వీధి గోడలపై ప్రారంభమైన నా రచనా వ్యాసాంగం పత్రికలపైకి విస్తరించింది. క్రమంగా ఉత్తరాలు, డాక్టరు సలహాలు,-జవాబులు శీర్షికల్లో కూడా అలంకరించిన నా పేరు మాప్రాంతమంతా సంచలనం సృష్టించింది-పావగడ ప్రాంతంలో తోడేళ్ళలాగ.

అప్పటికే కొంత అనుభవమున్న కొంతమంది సీనియర్ రాతగాళ్ళు నన్ను పిలిచి-'రచనా వ్యాసంగం పదవీ వ్యామోహంకంటె పరమ క్రూరమైనది. ఉబ్బసం వ్యాధికంటే కడు తీక్ష్ణమైనదని, అంతగా ఉబలాటముంటే గోడలపై వ్రా సే ఉద్యోగం ఇప్పిస్తాము- ఓపికగా వ్రాసుకో' అని చిలక్కు చెప్పినట్లు చెప్పారు.

పోగాలము దాపురించిన వారు పెద్దల మాట వినరు గదా! నా విషయంలోనూ అంతే జరిగింది. నేను సైతం తెలుగు సాహిత్యానికి సారా కొంచెం ఖర్చుచేస్తా' అన్న విప్లవ గీతం పాడుకుంటూ కార్యోన్ముఖు ణ్ణయ్యాను.

×× ×× ××

అంధ్రప్రదేశానికి అట్టడుగున ఒక గ్రామముంది. అది కర్ణాటక ప్రాంతానికి ఆనుకొని ఉండడంవల్ల, కన్నడ భాషపై ఆ ప్రాంత ప్రజలకున్న అమిత మోజు వల్ల ఆ ఊరికి కిరికెర అన్న పేరు పెట్టుకున్నారు ముద్దుగా.

ఆ ఊళ్ళో ఉన్న ప్రైవేటు స్కూల్లో ఉద్యోగం వెలగబెట్టే రోజు లవి.

పెద్ద తరగతులకు నేను పాఠాలు చెబితే విద్యార్థులు అమిత తెలివిగలవాళ్ళవుతారు. వాళ్ళ స్టాండర్డుకు తగ్గ ఉద్యోగాలు మన దేశంలో లేవు అన్న నగ్న సత్యాన్ని ప సిగట్టిన కమిటీ వాళ్ళు-ఒకటో తరగతికి 'అ, ఆ' లు చెప్పడానికి నియమించారు నన్ను.

నిజానికి అక్కడే నాకు రాతల పునాది రాళ్ళు లోతుగా పడ్డాయని ఘంటాపథంగా చెప్పగలను.

ఉద్గ్రంథాలన్నీ తిరగేశాను. ఏ కొమ్ములు తిరిగిన రచయితకూడా యాభై ఆరు అక్షరాలకు మించి తమ రచనల్లో ఉపయోగించుకోలేక పోయారన్న పచ్చినిజం తెలుసుకున్నాను. వర్ణమాలను ఆమూలాగ్రం బట్టీయం పట్టడమేగాక,కొంత మంది డాక్టర్ల పర్యవేక్షణలో మంచి దస్తూరీ వ్రాయడంలో అవలంబించవలసిన చిట్కాలు బాగా ఆకళింపు చేసుకున్నాను.

ఒకనాడు బడిముందు ఎద్దుల బండి ఆగిన శబ్దమైతే కిటికీ గుండా పారజూచాను.

ఆరడుగుల పొడవు వాడు. అచ్చం రాజకీయ నాయకుల వేషధారియై. చేతిని వార్తాపత్రిక అలంకరించగా, చూపుల డైరెక్షను తెలియనీయకుండా అడ్డంగా నల్లని కళ్ళజోడు ఉంచబడినవాడై బొద్దు మీసాలతో, తలచుట్టు తెల్లని పిట్టగోడ మాదిరి మట్టగించబడిన క్రాపు గలవాడై ఠీవిగా బడివైపే వస్తున్నాడు.

ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్యతో వసుండి వస్తున్నాడు కాబోలు ననుకున్న నా ముందే ముకుళిత హస్తుడై ప్రత్యక్షం కావడం గమనించిన నా నోట మాట పెగల్లేదు.

అంతలో అతడే కలుగజేసుకొని నేను వ్రాసిన-

"అ ఆలు-

అవి

కావు

ఇఈలు" అన్న కవిత పత్రికలో చదివి చాలా ఆనందం అనుభవించానని. అందులో నిబిడీకృతమైన సాహిత్య విలువలు అరగంట సేపు నమ్మేట గొట్టాడు.

నాలాంటి రచయిత ఆ ప్రాంతానికే గర్వకారణమని చెబుతూ-నేను పుట్టుకతో ధన్యమైన కొన్ని ఏరియాలు, వ్యక్తుల పేర్లు ఏకరువు పెట్టాడు.

ఇన్ని పొగడ్త లెందుకు లెండి... నా ఓటు మీకే వేయగలనని చెప్పబోయిన నేను నిదానమే ప్రధానమని గోడపై కనబడ్డ స్లోగన్ చూసి తటపటాయించాను.

ఉపోద్ఘాతమైపోయింది- విషయంలో అడుగిడుతున్నానని సూచిస్తున్నట్లు చిన్నగా దగ్గి-ఆంధ్రదేశంలో ఎంతో మంది కవులను, పండితులను, కవి పండితులను, రాతగాళ్ళను, కోతగాళ్ళను సన్మానించి పారేశానని-ఇంత దగ్గరగా ఉండి కూడా మీకు చెయ్యలేక పోవడం చాలా శోచనీయ విషయమంటూ నన్ను సన్మానం చేయించుకొనడానికి పురికొల్పాడు.

వానాకాలంలో పెన్నానదిలాగ, ఎండాకాలంలో చద్ది చేపల పులుసులాగా లోలోపలే పొంగిపోయింది నా మనసు.

అయినా,ఆ సంతోషాన్ని వ్యక్తం చెయ్యకుండా -"మహా రచయితల ముందు మే మెంత వారములెండి" అంటూ,తెలుగు సినిమాపాటల్లో ప్రయోగించే బూతుమాట లంతటి వాటిని సైతం నాకు విశేషణాలుగా ఉపయోగించి తిట్టుకున్నాను. (నన్ను నే నెంత హీనపరచుకుంటే ఎదుటి వారంత పొగిడేస్తారని అనుభవంలో తెలుసుకొన్న ఒకానొక టెక్నిక్ అది.)

'ఇది జుట్టుకాదు-చేతులు' అంటూ మెడపట్టుకుని జరజరా ఆఫీసు గదిలోకి లాక్కొని వెళ్ళాడు. హెడ్మాస్టరు లక్ష్మయ్య ముందు తన సన్మాన దీక్షను విన్నవించుకున్నాడు.

నాకు, లక్ష్మయ్యకు బద్ధవైర ముండడంచేత, అతడు నాకే సపోర్టుచేసి సన్మానాభిలాషను పడగొడతా డనుకున్నాను. అలా జరగలేదు. వచ్చిన ఆసామీతోనే చేతులు కలిపి నన్ను ఒప్పించాడు.

×× ×× ××

ఎక్కడికి వెళ్ళవలసి వచ్చినా-పడిగాపులుపడి అందరూ ఆశ్రయించే బస్సులు, రైళ్ళు ఎక్కడానికి మా ప్రాంతం వారు సుతరామూ ఇష్టపడరు. అన్ని రకాలుగా స్వయం సమృద్ధి సాధించడం వల్ల, ఇంధనం పొదుపుచేసే విధానం తెలిసి ఉండడం వల్ల సైకిళ్ళు, బండ్లు, గుర్రాలు, గాడిదలు లాంటి ఆధునిక ప్రయాణ సాధనాల నప్పుడే ఉపయోగించడం మొదలుపెట్టారు.

ఆ రోజు పెందలకడనే లేచి కడుపు చల్లగా ఉండాలని చద్దన్నం తిని,ద్విచక్ర శకటం అధిరోహించి వంకలు, వాగుల్లో దిగుతూ చక్రాలకు మెత్తుకుంటున్న కాలపంకిలాన్ని (నల్లమన్నును) అంబువులతో ప్రక్షాళనచేస్తూ చేరవలసిన గ్రామం చేరుకున్నాను.

'ఫలానా మంత్రిగారికి ఫలానా ట్రస్టు వారి స్వాగతాలు' అని అక్కడక్కడ చెట్లకు స్వాగత

ఏ సైకిల్ అయినా ఎన్నుకోండి కానీ కొనండి

భారత దేశంలో అత్యధికంగా అమ్మకమయ్యే 12 వోల్ట్స్ సైకిల్ డయనమో లైట్

Sankyo


ప్రకాశవంతమైన కాంతి కోసమే


మీ సైకిల్‌నకు అత్యంత నమ్మదగ్గది మరియు అధికంగా మన్నికనిచ్చే సన్‌క్యో డయనమో లైట్.

12 వోల్ట్స్/6 వాట్ మరియు 6 వోల్ట్స్/3 వాట్, ద్వందమైన బల్బు మరియు ఒకే బల్బులతో విరివైన ఆకారాలలో లభిస్తున్నాయి.

IJI ఇండో-జాపనీస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్

కలకత్తా






తోరణాలు కనిపించాయి కాని,నా గురించి ఒక్క వాక్యంకూడా లేదు.

అనుమానం శంకించి సెకిలు దిగాను. అల్లంత దూరంలో చుట్టూ రాళ్ళు పాతిన ఆవరణలోపల ఏదో కోలాహలం వినిపించింది.

అదే సన్మాన సభ అయ్యుంటుం దనుకొని లోపలకు పోబోయిన నన్ను గేటు దాట నివ్వలేదు-అక్కడే నిలబడిన ఓ గూండా లాంటి వాడు. నా గురించి ఎంత స్వడబ్బా వాయించుకున్నా వాడు వినిపించుకోలేదు.

పదిమైళ్ళు సెకిలు త్రొక్కడం వల్ల నరాలు గింజుకుపోయాయి, నాలుక పిడుచ కట్టింది-ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ హొటల్లోని ఇడ్లీలలాగ. నిలబడ్డానికే శక్తిలేదు.

దారితప్పానేమో అని అడ్రెస్ విచారి స్తే అంతా సరిగానే ఉంది. వెనుదిరిగి పోదామాఅనుకున్నాను. కష్టాలను, సుఖాలను సమ దృష్టితో ఆహ్వానించిన వాడే నిజమైన ధీరుడన్న గీతాబోధన గుర్తుకు వచ్చి ఆగిపోయాను.

"అన్ని కార్యక్రమాలు అయిపోయాయి, కవిగరు రాకపోవడంచేత సన్మాన మనకార్యమొకటి మిగిలిపోయింది" అని మైకులో ఎనౌన్సుమెంటు వింటూనే 'పదండి ముందుకు, పదండి త్రోసుకు' అన్న శ్రీశ్రీ కవితా దండకం స్మరించుకుంటూ,గూండాను వెల్లికిలా పడద్రోచి గుంపులో దూరి స్టేజి దగ్గర తేలాను.

బాలేందుని చూచిన కలువ బాలలా వికసించింది నన్ను చూస్తూనే-ఆహ్వానించిన ఆగంతకుడి మోము. అయిదారు మంది వి. ఐ. పి. ల్లాంటి వారు ఉన్నతాసనాల్లో వెలిగిపోతున్నారు. ఓ మూలగా వేసిన ఒక కాలు విరిగిన స్టూలును చూపించారు నాకు అలంకరించమంటూ.

కూర్చుంటే పడిపోతానేమో అని అనుమానిస్తున్నంతలో సన్మాన కార్యక్రమం ముగించి మైకు ముందుకు త్రోశారు "నీ తడాఖా చూపించు" అన్నట్లు. అంతలో కరెంటు పోయింది. .

కరెంటు ఎంత సేపటికీ రాకపోయేసరికి, నేర్చుకున్న ఉపన్యాసపాఠం మరిచిపోతానేమో అన్న ఆత్రంతోనూ, జనమంతా వెళ్ళిపోతున్నారే అన్న బాధతోనూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చిక్కిపోయిన గవర్నరులా ఫీలయ్యాను.

కరెంటుపై ఆశ వదిలాకఉపన్యాసం మొదలు పెట్టాను.

నా మాటలు నాకు వినబడ్డంలేదు కాని, సభికుల ఈలలు మాత్రం బాగా వినబడుతున్నాయి. అరచి అరచి రెండుమూడుసార్లు ప్రేగులు నోటి గుండా బయటికి వస్తే దిగమ్రింగికూడా ఉపన్యాస ప్రవాహం ఆపలేదు.

ఎంత సేపని గొంతుచించుకున్నా, చక్కని ఫోజు లిచ్చినా ఎదురుగా నిలబడిన ఫొటోగ్రాఫర్లు మాత్రం ఫొటో తియ్యలేదు.

'నీ ముఖం మండ' అని వాణ్ణి శపిస్తూ గాలి తీసిన సెకిలు ట్యూబులాగ ఉసూరుమని కూలబడ్డాను.

కార్యక్రమం ముగిశాక సెకిలు త్రొక్కడం నా చేతకాదని చేతులెత్తేశాను. ఓక మనిషిని ఏర్పాటు చేశారు,క్షేమంగా గమ్యం చేరడానికి!

వాడు సెకిలు ఎక్కిన విధానం చూస్తూనే అనుమానించి భయపడుతూనే వెనక సీట్లో కూర్చున్నాను. ఎంత వారించినా వినకుండా స్పీడు పెంచాడు-పిక్కల్లో బలముంది కదా అంటూ! తత్ఫలితంగానే మరుక్షణంలోనే ఇరవై అడుగుల వాగులో పడిపోయాను.

కుదుపులకు మెలకువ వచ్చి కళ్ళు తెరిచేసరికి తెలిసింది-ఎడమ కాలు విరిగిపోయిందని, బండిలో ఆసుపత్రికి తీసుకెళ్తున్నారని.

×× ×× ××

నేను చెప్పినదాంతో తృప్తిచెందని డాక్టరుగారు అంగాంగాలన్నీ లాగి-గంభీరంగా బాధను బిగబట్టుకున్న నన్ను బావురుమని ఏడ్చేదాకా వదలలేదు. విరిగిన కాలుకు బాండేజీ వేయాలంటూ మత్తు ఇంజెక్షనిచ్చాడు.

మత్తు తేరేసరికి ఎడమ కాలు నొప్పి తగ్గలేదు కాని,కుడికాలు కదిలించడానికే వీలు కాకుండా ఉంది. పడుకున్న వాడు మెల్లగా మెడ పైకెత్తి అతి కష్టంమీద చూసేసరికి కనిపించిన దృశ్యం-ఎడమకాలుకు బదులు, కుడి కాలుకు బాండేజీ వేసి ఉండడం.

ఎదురుగా వస్తున్న డాక్టరుపై కోతిలా ఎగిరి ముఖమంతా గిల్లేద్దా మన్నంత కోపం వచ్చింది.

పోలీసులకు, డాక్టర్లకు నిజం చెప్పినా వినే నైజం ఉండదని చిన్నప్పుడు చదివింది గుర్తుకు వచ్చి నిగ్రహించుకున్నాను. కట్టు కట్టడంలో జరిగిన చిన్న పొరపాటును గురించి సవినయంగా విన్నవించుకున్నాను.

నే నెంత నెమ్మదిగా చెప్పానో అతనంత గట్టిగా గొంతు రెట్టించాడు. "నా కన్న నీకే ఎక్కువ వైద్యం తెలిసినట్లుందే! నే నా మాత్రం తెలివిలేని దద్దమ్మ ననుకున్నావా? విరిగిన ఎడమ కాలుకు కట్టు బిగి స్తే కుడికాలుపైన భారమంతా మోపి నడవాల్సొస్తుంది. ఇంత శరీరాన్ని కుడికాలొక్కటే మోయలేక అప్పుడయినా తప్పకుండా చెరుకుగడలా విరిగిపోతుంది. అందుకే-ముందు జాగ్రత్తగాను, రెండు కాళ్ళకూ ఒకేసారి బాండేజీ వెయ్యానే వైద్య నియమాలికి లోబడియున్నా ఇలా చేశాను" అని హడలుగొట్టాడు నన్ను.

అంతలో నన్ను సన్మానానికి ఆహ్వానించి, ఈ సన్మానానికి కారకుడైన ఆగంతకుడు నేను పడున్న మంచం దగ్గరకు వచ్చి ప్రాణానికేం భయంలేదని,రెండుమూడేళ్ళలోనే సొంత కాళ్ళతో ఇంటికి నడుచుకు పోగలవని డాక్టరుగారు గారంటీ ఇచ్చాడని ఓదార్పు మాటలు చెప్పి వెళ్ళిపోయాడు.

×× ×× ××

"పది పూరీలు, పదిహేను చపాతీలు ప్రొద్దునగా తిని ఇప్పుడే వస్తానని బయలుదేరిన మీ కంతలోనే ఇంత ఘోరం ముంచుకొచ్చింది కదండీ..." అని ఏడుస్తున్న ఆడ గొంతు వినపడేసరికి- నేను చచ్చిపోయానని, ఐదేళ్ళ క్రితం కన్నుమూసిన పార్వతి దయ్యం రూపంలో ఇదంతా గమనించి తన చావుకు ముందు వడ్డించిన టిఫిన్నే గుర్తుంచుకొని ఎక్కడో విలపిస్తూ ఉందని అనుకొన్నాను.

చస్తే పీడ పోయిందిగాని, చచ్చిపోయిన దేవతలాంటి భార్యను చేరుకున్నానని ఆనందించాను.

ఆ ఆనందం ఎక్కువౌతూనే అర నిద్రలో ఉన్న నాకు మెలకువ కలిగింది. కళ్ళు తెరచి కప్పుకున్న దుప్పటి ఎత్తి ఎదురుగా ఏడుస్తున్న ఆమెను చూసిన నాకు కల చెదరినట్లయింది. "అండీ..." అని రాగాలు తీసి ఏడుస్తున్న ఏడుపు కరెంటు పోయిన రేడియోలా చటుక్కున ఆగిపోయింది.

ఆమెతోపాటు కన్నీరు కారుస్తున్న కొంతమంది ఒకరి మొఖా లొకరు చూసుకొని,ప్రతిపక్ష నాయకుల్లా అక్కడ నుండి వాకౌట్ చేశారు.

రాంగ్ నంబరులా ఏదో రాంగ్ బెడ్ నంబరని గ్రహించాను- వారు మరో వార్డులో జొరబడ్డం చూసి.

కొంత సేపటికి నా పుత్రశ్రేష్ఠులు వచ్చి సన్మానానికి కక్కుర్తిపడి కాలు విరగ్గొట్టుకున్నావంటూ చీవాట్లు పెట్టారు లెండి. అది వేరే విషయం.

ఏది ఏమైన అప్పటి నుండి 'సన్మానం' అనే పదం వినబడుతూనే ఈ సన్మాన సంఘటన సినిమా రీలు లాగా కళ్ళ ముందు కదులుతూ ఉంటుంది.

*